క్లుప్తంగా

మరణానంతరం వృద్ధుడి నేత్ర దానం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన విప్పర్ల బాల అంజయ్య (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యుల అనుమతితో నేత్రాలను శంకర ఐ బ్యాంకుకు దానం చేసినట్లు అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకులు, సంఘం జిల్లా కోఆర్డినేటరు సంప్రదాటి చలపతిరావు తెలిపారు. బాల అంజయ్య నేత్రాలు దానం చేయడం ఆదర్శనీయమని కొనియాడారు. నేత్ర దానానికి సహకరించిన కుటుంబ సభ్యులు ప్రసన్నాంజనేయులు, మారుతి, శివప్రసాద్‌ను ఆయన అభినందించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



వినుకొండ: పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలో గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మరనాత వెల్లటూరు యేసయ్య సహకారంతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారిణి ఎస్. రేణుకమ్మ మాట్లాడుతూ మనిషి జీవనశైలిని మార్చ గలిగేది చదువు ఒక్కటేనని తెలిపారు. చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చక్కగా చదువుకోవాలని సూచించారు. హెల్ప్ ఫౌండేషన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, సమాధానం, వినయ్ పాల్గొన్నారు.

26న శివపార్వతుల కల్యాణం

వినుకొండ: మహా శివరాత్రి సందర్భంగా శాంతి ఆశ్రమం ట్రస్ట్ వినుకొండ ఆధ్వర్యంలో సాయి బృందావనం చిన్న షిరిడీ వద్ద శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు హిమాలయ గురూజీ ఆదివారం తెలిపారు. శివరాత్రి జాగారంలో భాగంగా రాత్రి అఘోర భస్మాభిషేకం, లింగోద్భవ సమయంలో శివుడికి చండీ ప్రదక్షిణ, అన్నాభిషేకం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ అధ్యక్షులు పెండేల వెంకట మోహనరావు, కె. అనంత కోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల పుల్లారావు, మునిరెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూలులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


రొంపిచర్ల : మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ స్కూలులో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ బి. రవినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20న పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9701030357 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



నరసరావుపేట టౌన్: ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ అరుణ ఆదివారం తెలిపారు. సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించామని చెప్పారు. అనారోగ్యంతో మృతి చెందినట్లు భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించామని తెలిపారు. మృతుడి ఆనవాళ్లు తెలిసివారు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

శిథిల వంతెనతో భయం..భయం



శావల్యాపురం: మండలంలోని కారుమంచిలో ఏబీసీ కెనాల్‌పై వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరువైపులా రైలింగ్ లేకపోవడంతో వాహనదారులు భయపడుతున్నారు. ఈ వంతెన మీదుగానే నిత్యం ఏల్చూరు, సంతమాగులూరు, అడ్డరోడ్డు తదితర గ్రామాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. ఆదమరిచి వాహనం నడిపితే ఇక అంతే సంగతి అని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు.

పేదల ఇంటి ఆశలకు గండి

- కాలనీలో కూటమి కాంట్రాక్టర్ల దోపిడీ
- బేస్‌మట్టం మట్టితో నింపేందుకు రూ.6వేలు డిమాండ్
- క్యూరింగ్ పేరుతో మరో రూ.3.500 స్వాహా
- ఇసుకకు కూడా అదనంగా చెల్లించాలని డిమాండ్
- వాపోతున్న లబ్ధిదారులు



వినుకొండ రోడ్డులోని జగనన్న కాలనీ

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగనన్న కాలనీ (పీఎంఏవై–ఎన్‌టీఆర్ నగర్)లలో లబ్ధిదారులను దోచుకోవడమే పరమావధిగా పాలక పార్టీల నాయకులు, వారి అనుచరులు వ్యవహరిస్తున్నారు. కాలనీలను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. గత ప్రభుత్వంలో ఉచితంగా ఇచ్చిన ఇంటి స్థలాలను లాక్కోడానికి ప్రయత్నిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకోలేదనే కారణంతో గుంజుకుంటామని ఇప్పటికే నాయకులు కూడా ప్రకటించారు. తాజాగా ఇల్లు నిర్మించుకునే వారి వద్ద నుంచి మట్టి, ఇసుక, చేసిన నిర్మాణాలు తడిపేందుకు నీటి రూపంలోనూ నిలువునా దోచుకుంటున్నారు.

గత ప్రభుత్వ ఆశయానికి గండి

గత ప్రభుత్వం ఇల్లులేని వారు ఉండకూడదనే ఉద్దేశంతో వినుకొండ రోడ్డులో వంద ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూమి సేకరించి కాలనీ ఏర్పాటు చేసింది. నరసరావుపేట పురపాలక పరిధిలోని 6,125మంది పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేసింది. అప్పటి ప్రభుత్వం ప్రోత్సాహంతో 2,000 మందికి పైగా నిర్మాణాలు చేపట్టారు. వివిధ కారణాలతో మిగతా వారు ఇంటి నిర్మాణం ప్రారంభించలేకపోయారు. అయితే, ప్రభుత్వం మారాక ఇంటి నిర్మాణం ప్రారంభించని వారి స్థలాలు రద్దు చేసి రెండుసెంట్ల చొప్పున వేరొకరికి అందజేస్తామనే నాయకుల ప్రకటనలతో లబ్ధిదారులు బెంబేలెత్తిపోయారు. పలువురు టైప్–3 విధానంలో ఇంటి నిర్మాణాలు కట్టించి ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. కూటమి పార్టీలకు అనుకూలురైన కాంట్రాక్టర్లు నిర్మాణాలు చేపట్టారు. వాస్తవానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80లక్షలతో ఇంటి నిర్మాణం వారే పూర్తి చేయాల్సి ఉంది. దీనికి కావాల్సిన మట్టి, ఇసుక, నీరు, ఐరన్, ఇంటి దర్వాజాలు, కిటికీలు తదితర సామగ్రిని వారే ఏర్పాటు చేయాలి.



కాలనీలో ఆగిపోయిన నిర్మాణం

పనులకు రేట్లు పెంపు

నియోజకవర్గం మొత్తం మట్టి కాంట్రాక్ట్ చేజిక్కించుకొన్న ముఖ్య నేత బంధువు ట్రక్కు మట్టి రూ.6వేలకు పెంచేశాడు. ఆ మట్టి వినియోగానికి జగనన్న కాలనీని ఎంచుకున్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభించిన కాంట్రాక్టర్లు బేస్‌మట్టాన్ని మట్టితో నింపుకునేందుకు రూ.6వేలు చెల్లించాలని లబ్ధిదారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఆ లెక్కన డబ్బులు చెల్లించిన వారి ఇంటికే మట్టిని తోలుతున్నారు. ఉచితంగా అందజేయాల్సిన ఇసుకకు కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. పైగా నిర్మాణాలను నీటితో క్యూరింగ్ చేసేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.3,500 వసూలు చేసి, ఆ తర్వాత పనిచేయకుండా జేబులో వేసుకుంటున్నారు. పేదలైన తమను దోచుకోవటమే పనిగా పెట్టుకున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

స్నేహం, సేవా భావం రోటరీ లక్ష్యం



కందిపప్పు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చిలకలూరిపేట: ప్రపంచ శాంతి, పరస్పర స్నేహం, సేవాభావం లక్ష్యంగా రోటరీ సంస్థ ఏర్పాటైందని రోటరీ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ 1905లో నలుగురు సభ్యులతో స్థాపించిన బడిన రోటరీ సంస్థ ప్రస్తుతం 200 దేశాలలో వేల క్లబ్‌లు, లక్షల సభ్యులతో సేవలు అందజేస్తున్నదని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, రైతులకు చెక్ డామ్‌లు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తూ సేవా ప్రస్థానం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచం నుంచి పోలియో మహమ్మారిని నిర్మూలించడంలో రోటరీ ఘనమైన చరిత్ర కలిగి ఉందని వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ బాధితులకు సేవలు అందించే స్వచ్ఛంధ సంస్థకు స్థానిక క్లబ్ మాజీ అధ్యక్షుడు గళ్లా సాంబశివరావు 50 కేజీలు కందిపప్పు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఆళ్ల వేమనరెడ్డి, కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, తొట్టెంపూడి వెంకటేశ్వరరావు, మండల లక్ష్మీనారాయణ, ముక్తార్ అహమ్మద్, కాపు వెంకటరావు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ



సిబ్బందితో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి

నాదెండ్ల: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నపుడే అందమైన గ్రామాలు, ఆరోగ్యకరమైన వాతావరణం సాధ్యమవుతాయని ఈవోపీఆర్డీ ఎం. నిర్మల లక్ష్మీకుమారి చెప్పారు. మండలంలోని ఎండుగుంపాలెంలో శని, ఆదివారాలు స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆమె పంచాయతీ, సచివాలయాల పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశమయ్యారు. చెత్తను తడి, పొడి విడివిడిగా సేకరించి డంపింగ్ యార్డుకు చేర్చాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యవంతుల్ని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ అహమ్మద్ ఉన్నారు.

వినుకొండలో..

మండలంలోని చీకటీగలపాలెంలో చెత్త నుంచి సంపద తయారీపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులంతా తడి, పొడి చెత్తను వేర్వేరుగా హరిత రాయబారులకు అందించాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేస్తారని, తద్వారా వచ్చిన సంపదను పంచాయతీకి జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి జిలాని, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

బాసట ఆధ్వర్యంలో 230 మందికి వైద్య సేవలు



శిబిరంలో వైద్య పరీక్షలు

యడ్లపాడు: బాసట స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు 230 మందికి బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి, రెండు నెలలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ముందుగా వైద్యులు గుంటుపల్లి దివ్య తేజ, కొంటినేని నవ్యశ్రీ, గుంటుపల్లి భవ్య తేజ, నేలటూరి రాజేశ్వరి షుగర్ నియంత్రణపై సలహాలు, సూచనలు చేశారు. వలంటీర్ల కోసం సీనియర్ లెక్చరర్ రావూరి దేవయ్య భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బాసట సభ్యులు నూతలపాటి కాళిదాసు, సామినేని శ్రీనివాసరావు, ముత్తవరపు రవీంద్రబాబు, కేతా రామబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, బచ్చు రాజేష్ కుమార్, ముత్తవరపు వేణుగోపాల్, కోయ రామోజీరావు, రావి సురేష్‌బాబు, చిట్టిపోతు రంగారావు, రావూరి సురేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతను పరామర్శించిన మర్రి

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గొర్రె సాంబశివరావు (శివ) ఇటీవల గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.



అతి వేగం మిగిల్చిన శోకం

- బైక్‌పై ముగ్గురు బాలుర ప్రయాణం
- ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదం
- వెనుక కూర్చున్న బాలుడు బస్సు చక్రాల కిందపడి మృతి



విజయ్(ఫైల్)

చిలకలూరిపేట టౌన్: క్షణిక నిర్లక్ష్యం.. అదుపు తప్పిన వేగం ఒక కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది. బంధుమిత్రుల గుండెల్లో తీరని బాధ మిగిల్చింది. చిలకలూరిపేట మండలం గోపాళవారిపాలెంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృత్యువాత పడ్డాడు.

ప్రమాదం జరిగిందిలా..

గోపాళంవారిపాలేనికి చెందిన కంభంపాటి శేఖర్, కాకర్లమూడి విజయ్ మండలంలోని రాజాపేట గురుకులం పాఠశాలలో 8వ చదువుతున్నారు. తమ సమీప బంధువు ఇంట్లో శుభకార్యం ఉందంటూ పాఠశాల ప్రిన్సిపాల్‌ను అభ్యర్థించి ఇద్దరిని పెద్దలు ఇంటికి తీసుకువచ్చారు. ఆదివారం తమ గ్రామానికి సమీపంలోనే ఉన్న రాజాపేటలో ప్రార్థన కూటములకు ఇద్దరూ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అదే గ్రామానికి చెందిన మరో మిత్రుడు కాకర్లమూడి బాబుతో కలిసి ఒకే బైక్‌పై ఆదివారం మధ్యాహ్నం ప్రయాణమయ్యారు. గ్రామం పొలిమేర దాటక ముందే ముందున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న మోపెడ్‌ను ఢీకొన్నారు. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న విజయ్(13) ప్రమాదవశాత్తు జారి బస్సు టైరు కింద పడ్డాడు. తలపై బస్సు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శుభకార్యం కూడా నిలిచిపోయింది. విద్యాలయంలోనే ఉంచితే తమ బిడ్డ ప్రాణాలన్నా నిలిచేవే అంటూ కుటుంబ సభ్యులు కన్నీళ్ల పర్యంతరం అవుతున్నారు. మృతుడి తండ్రి కె. నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పాఠశాల విద్యార్థి మృతిపై ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన చెందుతూ కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

కోటప్ప కొండలో అగ్ని ప్రమాదం



కొండపై మంటలు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట మేజర్ కెనాల్ సమీపంలోని రుద్ర శిఖరంపై పాప వినోచనస్వామి ఆలయ సమీపంలో మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు, భక్తులు అధికారులకు సమాచారం అందజేశారు. ఏడీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వైభవంగా గంధ మహోత్సవం



అశ్వంపై గంధం ఊరేగింపు

నాదెండ్ల: అప్పాపురంలోని హజరత్ మహబూబ్ సుభాని బాబా దర్గా 18వ ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని ఆదివారం గంధ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం ప్రారంభమైన ఉరుసు మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రెండో రోజు ఆదివారం స్వామి గంధాన్ని ప్రత్యేకంగా అలంకరించిన అశ్వంపై ఊరేగించారు. దర్గా నుంచి గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. మేళతాళాలతో జరిగిన ఊరేగింపులో కులమతాలకు అతీతంగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం దర్గా వద్దకు గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు అనంతరం భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్గా వద్ద భారీ అన్నదానం చేశారు. కార్యక్రమాలను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చెత్త సంపద కేంద్రాల ద్వారా అదనపు ఆదాయం

జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి



శావల్యాపురంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

శావల్యాపురం: చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని జిల్లా పంచాయతీ అధికారి యం.వి. విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. శావల్యాపురంలోని చెత్త సంపద కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, చెత్త సంపద కేంద్రం గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని ప్రజలంతా క్లాప్‌మిత్రలకు సహకరించి తడి, పొడి చెత్తను రిక్షాలో వేయాలని ఆయన సూచించారు. పరిసరాలతో పాటు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. శావల్యాపురంలోని గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి వెంబడి చెత్తాచెదారం వేయకుండా పంచాయతీ వారికి సహకరించాలని ఆయన కోరారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. తడి, పొడి చెత్త గురించి వివరించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛ ఆంధ్ర కోసం కృషి చేయాలని తెలిపారు. ఆయనతో పాటు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ ఏసురాజు, ఈవోపీఆర్డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాకోబు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో రామలింగేశ్వరస్వామికి పూజలు



కుంకుమార్చనలో మహిళలు

వినుకొండ : స్థానిక శ్రీ ప్రసన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో వినుకొండ నియోజకవర్గ వేదమాత బ్రాహ్మణ అర్చక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పలు పూజలు నిర్వహించారు. నగర సంకీర్తన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, సువాసినీలతో లక్ష కుంకుమార్చనతో పాటు పతెం వేణుశర్మతో శ్రీచక్ర అర్చన జరిపారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పాలపర్తి సుబ్బయ్య, చంగవల్లి శ్రీరామచంద్రబాబు, నారాయణం రామ్మోహన్ ఆచార్యులు, మెరుసుపల్లి రాఘవశర్మ, పోతుకూచి శ్రీనివాసశాస్త్రి, వేలమూరు శేషసాయిశర్మ, వెలమకన్ని చంద్రశేఖర్‌శర్మ, ప్రతాపగిరి విష్ణుశర్మ, వేలమూరి సాయిశర్మ, యనమండ్ర సాయిరామశర్మ, గాలి రమణారావు, పి.వి.సురేష్‌బాబు, గాలి శ్రీనివాసరావు, యడవల్లి శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

శావల్యాపురం జెడ్పీ హైస్కూలుకు మహర్దశ

- పీఎంశ్రీ నిధులతో అభివృద్ధి పనులు
- పాఠశాల్లో మౌలిక వసతుల కల్పన



శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల

శావల్యాపురం: పీఎం శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఇందులో భాగంగా విద్యార్థులకు వసతుల కోసం కేంద్రం నిధులు కేటాయించింది. క్రీడా మైదానం అభివృద్ధికి లక్ష రూపాయలు మంజూరు చేసింది. ఈ నిధులతో వాకింగ్ ట్రాక్, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. రెండో ఆర్వో ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కిచెన్ గార్డెన్ ఏర్పాటు నిమిత్తం రూ.85 వేలు, ఇంకుడు గుంత పనులను రూ. 1.25 లక్షలతో చేపట్టారు. రూ.50 వేలతో ఎన్‌సీసీ స్కౌట్స్ ఏర్పాటు చేయనున్నారు. దివ్యాంగ విద్యార్థుల సౌకర్యం కోసం రైలింగ్ నిర్మాణాలు ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ఏడుగురు దివ్యాంగ విద్యార్థులకు రవాణా భత్యం కింద సంవత్సరానికి రూ.3 వేలు చొప్పున రూ.21వేలను ప్రభుత్వం మంజూరు చేసింది.



యంత్ర పరికరంతో వాకింగ్ ట్రాక్ పనులు

గత ప్రభుత్వ హయాంలో అదనపు గదుల నిర్మాణం

జూనియర్ కళాశాలతో పాటు 6 నుంచి 10 తరగతుల వరకు 556 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పనుల్లో భాగంగా ఆరు అదనపు తరగతి గదులు నిర్మాణ కోసం రూ. 1.47 కోట్లు మంజూరయ్యాయి. ఎంపీపీ నిధులు రూ. 4లక్షల వ్యయంతో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు కూర్చునేందుకు ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేశారు.



ఎంపీపీ నిధులతో పూర్తి చేసిన షెడ్డు

పథకానికి ఎంపిక కావడం సంతోషం



మా పాఠశాల పీఎంశ్రీ పథకానికి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుదల వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగం జరుగుతుంది. శారీరకంగా, మానసికంగా చాలా మేలు జరుగుతుంది.

– బొద్దపాటి విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, శావల్యాపురం

శరవేగంగా పనులు



పీఎంశ్రీ నిధులతో పాటు ఎంపీపీ నిధులు రూ.4 లక్షలతో హైస్కూలు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ఆరు తరగతి గదుల నిర్మాణం పూర్తయింది. పూర్తి అయితే, భవనానికి, తలుపులకు రంగుల వేయకపోవడంతో సామగ్రి తుప్పు పడుతోంది. అధికారుల స్పందించాలి.

–పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, విద్యా కమిటీ చైర్మన్, శావల్యాపురం

రెడ్డి పేరంటాలమ్మ ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న వజ్జా కుటుంబ సభ్యులు

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గల శ్రీ రెడ్డి పేరంటాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. గ్రామానికి చెందిన వజ్జా లింగయ్య కుమారులు శ్రీనివాసరావు, రవికుమార్, రాధ కుటుంబ సభ్యులు శనివారం రూ.2,16,000ను కమిటీ సభ్యులకు శనివారం అందించారు. చారిత్రాత్మక పేరంటాలమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి గతేడాది శ్రీకారం చుట్టారు. రూ.2 కోట్ల వ్యయంతో జరుగుతున్న ఆలయ పనులు పూర్తి చేసి, మార్చి 17న స్వామి ప్రతిష్ట నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.